రాజారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



సీతారామపురం: మర్రిపాడులో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డిని సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, సీనియర్ నాయకులు గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి, తలసాని రమణయ్య, తిరుపాలు, ఈరి ప్రసాద్ పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు సోమవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి సర్పంచ్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో చేరెడ్డి ప్రభావతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో రిటర్నింగ్ అధికారి సోమవరపు భాస్కర్‌రెడ్డి ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి ధృవీకరణ పత్రం అందజేశారు. మండలంలోని మహిమలూరులో వార్డు సభ్యుడిగా మోరంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మర్రిపాడు మండలంలోని పడమటినాయుడుపల్లి 3వ వార్డు సభ్యుడిగా పడసాల వినోద్, పొంగూరుకండ్రిక 1వ వార్డు సభ్యురాలిగా కొమ్మి వెంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికై ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి

జలదంకి: మండల అభివృద్ధికి అందరం సమష్టిగా కృషి చేద్దామని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, తహసీల్దార్ పద్మావతి, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఎంఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ అపర కర్మల భవనానికి ఎమ్మెల్యే విరాళం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి పట్టణంలోని బ్రాహ్మణ సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు బ్రాహ్మణ సామాజిక వర్గీయుల అపర కర్మల భవన నిర్మాణానికి రూ.5 లక్షలు వ్యక్తిగత విరాళంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కావలిలో ఆదివారం రాత్రి జరిగిన బ్రాహ్మణ సంఘం సమావేశంలో ఎమ్మెల్యే తన విరాళం అందజేసినందుకు బ్రాహ్మణులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ముసునూరులో ఉన్న రూ.కోట్ల విలువ చేసే 'గాలి వారి బ్రాహ్మణ సత్రం' స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే చొరవ తీసుకుని బ్రాహ్మణులకు కేటాయించారని తెలిపారు. ఇప్పటికే ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్, గేటు నిర్మించేలా చేసి ఎమ్మెల్యే స్థలాన్ని కాపాడారన్నారు. స్థలాన్ని పూర్తిగా బ్రాహ్మణులు తమ శుభ కార్యక్రమాలకు వినియోగించుకునేందుకు ఎమ్మెల్యే అవకాశం కల్పించారని తెలిపారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సొంత నివాసం లేని బ్రాహ్మణుల కుటుంబంలో ఎవరైనా వ్యక్తి చనిపోయినప్పుడు పార్థివ దేహాన్ని ఉంచుకునేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ

జలదంకి: మండలంలో ఈ నెల 19న జరగనున్న ఎల్ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ స్థానానికి, వేములపాడు 7వ వార్డు స్థానానికి సంబంధించి పోలింగ్ కేంద్రాలను సోమవారం కలిగిరి సర్కిల్ సీఐ మహమ్మద్ ఫిరోజ్ పరిశీలించారు. ఎల్ఆర్ అగ్రహారంలో 6 పోలింగ్ కేంద్రాల్లో 1,312 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో గ్రామంలో పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని సీఐ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సై ఆదిలక్ష్మి, ఏఎస్సై హరిబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల: అనంతసాగరం మండలం చిలకలమర్రి సచివాలయం పరిధిలోని గుడిగుంట, చిలకలమర్రి గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. చేజర్ల మండలం ఏటూరు సచివాలయం పరిధిలోని ఎస్‌పీ కండ్రిక, ఏటూరు గ్రామాల్లో 17, 18 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.